క్లుప్తంగా

ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్‌లో చైతన్య



ఎమ్మెల్సీ అభ్యర్థులతో చైతన్య శాప్‌నెట్ చైర్మన్

అద్దంకి: తూర్పు రాయలసీమ (ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు) పట్టభద్రుల ఎమ్మెల్సీ పట్టభద్రుల అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి బుధవారం నామినేషన్ వేశారు. చిత్తూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య పాల్గొన్నారు. ఎన్నికల్లో తన నియోజకవర్గానికి సంబంధించి అవసరమైన సహాయ సహకారాలు తప్పనిసరిగా అందిస్తానని చెప్పారు.

హనుమోజీపాలెంలో నేత్రదానం

చినగంజాం: ఇంకొల్లు మండలంలోని హనుమోజీ పాలెం గ్రామానికి చెందిన అలూరి సీతారావమ్మ (95) బుధవారం మరణించడంతో ఆమె నేత్రాలను దానం చేశారు. మృతురాలి మేనల్లుడు ఆరె సుబ్బారావు, భార్య కామేశ్వరమ్మలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి నేత్రాలను దానం చేసేందుకు సిద్ధం అయ్యారు. గుంటూరు శంకర కంటి ఆసుపత్రి సిబ్బంది మృతురాలి కార్నియాలను సేకరించారు. కార్యక్రమంలో అవయవదాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు, జెట్టి స్వామి, రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శి, ట్రెజరర్‌లు బీ వెంకటరెడ్డి, కరి కమలేశ్వరరావు, యూ శ్రీమన్నారాయణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అలయ ప్రదక్షిణ రోడ్డు ప్రారంభం



సిమెంట్ రోడ్డు పైలాన్ ఆవిష్కరించిన దాత కుటుంబ సభ్యులు

వేటపాలెం: రామన్నపేట పంచాయతీ శివారులో పంట పొలాల్లో వేంచేసియున్న కనకనాగవరపమ్మ అమ్మవారి దేవస్థానం చుట్టూ నూతనంగా ఏర్పాటు చేసిన ప్రదక్షిణ సిమెంట్ రోడ్డుని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో జీవీఎల్ కుమార్ మాట్లాడుతూ అనంత మైనింగ్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ పోలిశెట్టి మోహన్‌రావు సమకూర్చిన రూ. 2.50 లక్షల నిధులతో భక్తులు ప్రదక్షిణలు చేయడానికి వీలుగా సిమెంట్ రోడ్డు ఏర్పాటు చేశారని తెలిపారు. దాత కుటుంబ సభ్యులతో ప్రారంభించామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఏ భానుమూర్తి, బండ్లబాబు, పోలిశెట్టి సౌజన్య, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య



విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

కారంచేడు: రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం అందిస్తోందని ఎంఈవో ఎంవీ సత్యన్నారాయణ అన్నారు. బుధవారం ఆయన మండలంలోని దగ్గుబాడు అంబేడ్కర్‌నగర్ ప్రాథమిక పాఠశాల వార్షిక తనిఖీలో భాగంగా పరిశీలించారు. అనంతరం ఆయన పాఠశాల రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల బోధనా తీరును ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, కుకింగ్ నిర్వాహకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగుల నిరసన



చీరాల అర్బన్: డిమాండ్ల సాధనకు తపాలా ఉద్యోగులు గేట్ మీటింగ్ నిర్వహించారు. రాష్ట్ర కార్మిక సంఘాలు ఎన్‌ఎఫ్‌పీఈ, ఎఫ్ఎన్‌పీఓ పిలుపు మేరకు బుధవారం స్థానిక ప్రధాన తపాలా కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. సంఘాల నాయకులు మాట్లాడుతూ అశాస్త్రీయమైన టార్గెట్లు విధించి తపాలా ఉద్యోగులను మానసిక ఒత్తిడికి గురిచేయడం మానుకోవాలన్నారు. టార్గెట్లపై ఉద్యోగుల మీద అధికారులు వేధింపులకు పాల్పడుతున్నారన్నారు. టార్గెట్లకు బలై ప్రాణాలు విడిచిన పామర్రు బజారు ఎస్‌పీఎం ఎస్.రవిప్రసాద్ కుటుంబంలో కారుణ్య నియామకం క్రింద ఉద్యోగం కల్పించాలన్నారు. కార్యక్రమంలో చీరాల బ్రాంచి ఎఫ్ఎన్‌పీఓ నాయకులు ఎం.వినోద్, చీరాల బ్రాంచి ఎన్‌ఎఫ్‌పీఈ నాయకులు డి.శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సాగవుతున్న వేరుశనగ పంట



ఇసుక భూముల్లో సాగు చేసిన మొక్కజొన్న

ఇసుక నేలల్లో బంగారం

- సిరులు కురిపిస్తున్న తీరప్రాంత ఇసుక భూములు
- ఇసుక భూములకు ప్రాణం పోస్తున్న ఎత్తిపోతల పథకాలు
- ఏడాదికి మూడు పంటలు

వేటపాలెం: కష్టే ఫలి అన్నారు పెద్దలు. మానవుడు అనుకుంటే సాధించలేనిది ఏది లేదు. పనికి రావనుకున్న వాటిని పనికి వచ్చే విధంగా తీర్చిదిద్దడం మామూలు విషయం కాదు. ఒకప్పుడు ఎందుకూ పనికి రావనుకున్న తీర ప్రాంత ఇసుక భూములు ఇప్పుడు రైతులకు సిరులు కురిపిస్తున్నాయి. ఈ భూముల్లో రైతులు ఏడాదికి మూడు పంటలు పండిస్తున్నారు. వర్షాకాలంలో వరి, వేసవి కాలంలో వేరుశనగ, చేమదుంప, మొక్కజొన్న, మిరప, కాయగూరల పంటలు సాగుచేస్తున్నారు. మూడు ప్రాంతాల్లోని ఎత్తిపోతల పథకాల కింద దాదాపు 8 వేల ఎకరాల ఇసుక భూములకు సాగునీరు పుష్కలంగా అందుతోంది. లేని పక్షంలో అరు తడి పంటలుగా ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యుత్ మోటార్లతో బోరుబావుల ద్వారా పంటలను తుంపర సేద్యంతో పంట పండిస్తున్నారు. 15 ఏళ్ల కిందట తీరం వెంట ఇసుక భూముల్లో సాగుకు పనికిరాని భూములుగా పేరుండేది. ఆ భూముల్లో సరుగుడు, జీడిమామిడి తోటలు పెంచేవారు. వీటిని అప్పటిలో అడవి ప్రాంతాలుగా పిలుచుకునే వారు. అయితే ఎత్తిపోతల పథకాలు ప్రారంభించిన తర్వాత ఇసుక భూముల్లో ఉన్న సరుగుడు, జీడిమామిడి తోటలను తొలగించి ఆ భూముల్లో వరి, వేరుశనగ పంటలు సాగుచేస్తున్నారు. మండల పరిధిలో తీరప్రాంతాల వెంట స్ట్రయిట్ కట్ కాల్వలపై అక్కాయిపాలెం ఎత్తిపోతల పథకం, నాయినపల్లి, మోటుపల్లి ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. పాపాయిపాలెం, అక్కాయిపాలెం, చల్లారెడ్డిపాలెం, కఠారివారిపాలెం, పొట్టిసుబ్బయ్యపాలెం, కొత్తపాలెం, బచ్చులవారిపాలెం, కొత్తరెడ్డిపాలెం, పాతరెడ్డిపాలెం, మోటుపల్లి ప్రాంతాల్లోని భూముల్లో మూడు పంటలు పండిస్తున్నారు. వర్షాకాలంలో ఎత్తిపోతల పథకం ద్వారా వరి పైరు సాగు చేశారు. ఎకరాకు 33 నుంచి 35 బస్తాల వరకు ధాన్యం పండించారు.



నాయినపల్లి ఎత్తిపోతల పథకం

భారీగా పెరిగిన తీరప్రాంత భూములు విలువ..

తీరప్రాంతంలో ప్రభుత్వం కోట్ల నిధులతో సముద్రతీర గ్రామాలకు తారు రోడ్డు సౌకర్యం కల్పించింది. దీనికి తోడు ఎత్తిపోతల పథకాలతో తీర ప్రాంత భూములో మంచి పంటలు సాగు చేగు చేస్తున్నారు. గతంలో ఈ భూములు విలువ రూ. 20 వేలు ఉండేది, ప్రస్తుతం ఈ భూముల విలువ బహిరంగ మార్కెట్‌లో రూ. 30 లక్షల నుంచి రూ.1 కోటి వరకు పలుకుతోంది. దీనికి తోడు ఒంగోలు టూ దిగమర్రు జాతీయ రహదారి సముద్ర తీర ప్రాంతం నుంచి వెలుతుండంతో ఈ భూములుకు మరింత గిరాకీ ఏర్పడింది. చీరాల, వేటపాలెం సముద్ర తీరం వెంట భారీగి రిసార్ట్‌లు కట్టడంతో పర్యటకులు సందడి విపరీతంగా పెరిగిపోయింది. నిత్యం తీరవద్ద సినిమా షూటింగ్‌లతో పాటు బుల్లితెర సీరియల్స్ తీస్తున్నారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి సీఎం జగన్



సమావేశంలో మాట్లాడుతున్న కరణం వెంకటేష్

- నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్

చీరాల: బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వంటి అణగారిన వర్గాల ఆశాజ్యోతి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అన్నారు. బుధవారం రామకృష్ణాపురంలోని క్యాంప్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. దేశంలో ఏ సీఎం కూడా బీసీలకు పెద్ద ఎత్తున అవకాశాలు కల్పించలేదని, కేవలం మన జగనన్న 18 ఎమ్మెల్సీ స్థానాల్లో 14 బీసీ, ఎస్టీ, ఎస్సీ, మైనార్టీలకు కేటాయించి అణగారిన వర్గాల పట్ల తనకున్న ఆప్యాయతను మరోసారి రుజువు చేసుకున్నారన్నారు. గతంలో నాలుగు రాజ్యసభ సీట్లను బీసీలకు, అలానే చీరాలకు చెందిన చేనేత వర్గానికి చెందిన పోతుల సునీతకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించడంపై ఆయన సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. గత టీడీపీ పరిపాలనలో వందల కోట్లు ఇచ్చిన వారికే రాజ్యసభ, ఎమ్మెల్సీ వంటి నామినేటెడ్ పోస్టులు ఇచ్చేవారని విమర్శించారు. నవరత్నాలతో అన్నివర్గాలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. నేడు లాయర్లకు నేరుగా వారి ఖాతాల్లో నిధులు జమ చేస్తున్న ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో అన్నివర్గాలు కలిసి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని గెలిపించాలని, నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేద్దామని ఆయన పిలుపునిచ్చారు. వచ్చే నెల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గ్రాడ్యుయేట్ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి చంద్రశేఖరరెడ్డిని గెలిపించాలని ఆయన కోరారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్లు బొనిగల జైసన్‌బాబు, శిఖాకొల్లి రామసుబ్బులు, అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ మల్లి వైష్ణవి, కౌన్సిలర్లు మించాల సాంబశివరావు, బత్తుల అనిల్, గోలి జగదీష్, యాతం మేరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది బాధ్యతగా మెలగాలి



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కరణం

- సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే కరణం

చీరాల: సచివాలయ సిబ్బంది పనితీరు మెరుగుపర్చుకోవాలని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి సూచించారు. బుధవారం ఆయన పట్టణంలోని 30 వార్డు పరిధిలోని వార్డు సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో ఎక్కువ మంది సిబ్బంది వివిధ రకాల కారణాలతో సెలవులో ఉండటాన్ని పరిశీలించిన ఆయన తరచుగా రెండు మూడు సెక్టార్లులోని సచివాలయాల్లో సిబ్బంది సక్రమంగా హాజరు కావడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కారణాలు తెలపాలని అధికారులను నిలదీశారు. సెలవులు పెట్టినవారు చాలా రోజులు పాటు విధులకు దూరంగా ఉండడం సరైన పద్ధతి కాదన్నారు. మరోసారి ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా సిబ్బంది విధులుకు హాజరుకావాలన్నారు. అలానే పారిశుద్ధ్యం, మురుగుకాలువల తీరుపై స్థానిక కౌన్సిలర్ కంపా అరుణ్‌ను అడిగారు. విద్యుత్ స్తంభాలు కూడా లేవని చెప్పడంతో ఆయన మున్సిపల్ కమిషనర్ ఏసయ్యతో మాట్లాడి త్వరితగతిన విద్యుత్ స్తంభాలు, మురుగు కాలువలను సక్రమంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం జగన్‌తోనే సాధ్యం



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

పర్చూరు: అన్నీ వర్గాల ప్రజలకు సామాజిక న్యాయాన్ని పాటించడం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే సాధ్యమని మండల కన్వీనరు కఠారి అప్పారావు అన్నారు. పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ ఆదేశాల మేరకు నెహ్రూకాలనీలో వైఎస్సార్ సీపీ కార్యాలయ ఆవరణలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో 18కి గాను 11 స్థానాలు బీసీలకు అవకాశం కల్పించారంటే బీసీల మీద సీఎంకు ఎంత ప్రేమ ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. అనంతరం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి ప్రజాప్రతినిధులు, నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఇంకొల్లు మండల కన్వీనరు బండారు ప్రభాకరరావు, మార్టూరు మండల కన్వీనరు పఠాన్ కాలేషావలి, కారంచేడు మండల కన్వీనరు దండా చౌదరి, కారంచేడు ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు, వైస్ ఎంపీపీ యార్లగడ్డ సుబ్బారావు, సంగీత నృత్య అకాడమీ డైరెక్టరు యద్దనపూడి హరిప్రసాద్, దేవరపల్లి ఉపసర్పంచ్ తోకల కృష్ణమోహన్, పర్చూరు ఉపసర్పంచ్ గాదె సురేష్, నాయకులు లంకాశివ, ఆకుల హేమంత్, ఆకుల మధు, జంగా అనీల్‌కుమార్, కోట శ్రీనివాసరావు, మండల మహిళా కన్వీనరు తులసీ నాగమణి, పర్చూరు, అన్నంభొట్లవారిపాలెం సొసైటీ అధ్యక్షుడు కె.నాగేశ్వరరావు, కె.సుబ్బారావు, గర్నెపూడి సర్పంచ్ బిరుదు నాగేంద్రమ్మ, మాజీ సర్పంచ్ కె.సుబ్బారెడ్డి, దగ్గుబాటి రామకృష్ణ, భుక్యా బాబునాయక్, రాము, అడపా సుధాకరరెడ్డి, పిచ్చిరెడ్డి, వై.బుల్లిబాబు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

పర్చూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పర్చూరులోని బీఏఆర్ అండ్ టీపీ జూనియర్ కాలేజీ ఆవరణలో స్కిల్ హబ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు కళాశాల కరస్పాండెంట్ క్రిష్ణంశెట్టి రమేష్‌బాబు బుధవారం ఒక ప్రకటన తెలిపారు. పదో తరగతి, ఐటీఐ, ఇంటర్, డిగ్రీ చదివిన నిరుద్యోగ యువతీ, యువకులకు జిల్లాలో ఉన్న వనరుల డిమాండ్ ఆధారంగా డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, సేవింగ్ మెషిన్ ఆపరేటర్లకు మూడు నెలలు కోర్సులు అందిస్తారని తెలిపారు. 18 నుంచి 30 ఏళ్ల లోపు యువతీ, యువకులు 26వ తేదీ లోపల దరఖాస్తు చేసుకోవాలన్నారు. లేదా సోమవారం కళాశాలలో నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సర్టిఫికెట్లు అందజేస్తారని తెలిపారు. వివరాలకు 63027 64962 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

తోపుడు బండ్లు పంపిణీ నేడు

పర్చూరు: రోటరీ క్లబ్ ఆఫ్ హైద్రాబాద్ డెక్కన్, రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి సహకారంతో చిరువ్యాపారులకు నేడు గురువారం సాయంత్రం 4 గంటలకు భవనం వీరారెడ్డి రోటరీ భవన్‌లో తోపుడు బండ్లు పంపిణీ చేయనున్నట్లు రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు నాగభైరు శ్రీనివాసరావు, పంబి సదానందరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే మధ్యాహ్నం ఒంటి గంటకు రోటరీ భవన్‌లో పాటల పోటీలు, అలాగే 25వ తేది శనివారం ఉదయం 8 గంటలకు బీఏఆర్ అండ్ టీపీ జూనియర్ కాలేజీలో వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

గర్భిణులు జాగ్రత్తలు పాటించాలి

చీరాల టౌన్: గర్భిణులు విధిగా వైద్య పరీక్షలు చేయించుకుని వైద్యుల సూచనలు, సలహాలు పాటిస్తే ప్రసవాలు సాధారణంగా జరగడంతో పాటుగా తల్లీబిడ్డ ఆరోగ్యంగా జీవిస్తారని పీహెచ్‌సీ వైద్యురాలు శ్రీదేవి సూచించారు. శుక్రవారం మండలంలోని ఈపూరుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష యోజనలో భాగంగా గ్రామంలోని గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో మోక్షవాణి, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

రేపు మార్టూరు కూరగాయల మార్కెట్‌కు సెలవు

మార్టూరు: మార్టూరు జాతీయ రహదారి పక్కన గల విఘ్నేశ్వర కూరగాయల మార్కెట్‌కు ఫిబ్రవరి 24వ తేదీ సెలవు ప్రకటించినందున రైతులు కూరగాయలు మార్కెట్‌కు తీసుకురావద్దని మార్కెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కన్నెగంటి శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అసోసియేషన్ సభ్యుడు మొఘల్ అబ్దుల్లా ఇటీవల మరణించిన సందర్భంగా మార్కెట్‌కు సెలవు ప్రకటించినట్లు తెలిపారు. ఈసందర్భంగా వర్తక సంఘం తరపున మొఘల్ అబ్దుల్లా కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సాయం అందించినట్లు సంఘ సభ్యులు తెలిపారు.

శనగ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

జే.పంగులూరు: రైతులు పండించిన పంటను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం శనగల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి తల్లపనేని రామారావు కోరారు. బుధవారం పంగులూరులో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాపట్ల జిల్లాలో సుమారు 80 వేల ఎకరాల్లో రైతు శనగ పంటను సాగు చేశారని అన్నారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వం తగదు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఆనందకుమారి

పర్చూరు: గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఎంపీపీ మేకా ఆనంద కుమారి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మేకా ఆనందకుమారి అధ్యక్షతన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యం, డ్రైనేజీ, తాగునీరు అందించడంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. వేసవి దృష్ట్యా గ్రామాల్లో చెరువులు అన్నీ నింపేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బ్రహ్మయ్య మాట్లాడుతూ గ్రామాల్లోని చెరువులు నింపుటలో ఏమైనా సమస్యలు తలెత్తినా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. పర్చూరుకు సంబంధించి డ్రైనేజీ, కచ్చా డ్రైన్లు, శానిటేషన్ కు సంబంధించి మ్యాప్ తయారు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏవో రామ్మోహనరెడ్డి, ఎంపీడీవో లక్ష్మీదేవి, తహసీల్దారు నెహ్రూబాబు, వైస్ ఎంపీపీ పాలేరు వీరయ్య, ఎంపీటీసీలు, ఎంఈవో నాగేశ్వరరావు, సీడీపీవో సుభద్ర, అధికారులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి ట్రస్ట్ సేవలు అభినందనీయం



విద్యార్థినులకు అల్పాహారాన్ని అందిస్తున్న ట్రస్ట్ సభ్యులు

చీరాల అర్బన్: పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు స్టడీ అవర్స్‌లో అల్పాహారాన్ని సత్యసాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో అందించడం అభినందనీయమని పేరాల ఆంధ్రరత్న మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం బీ.సాల్మన్, కొత్తపేట జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం నూనె నాగవర్ధిని అన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం నుండి రెండు పాఠశాలల్లో పదోతరగతి చదువుతున్న 200 మంది విద్యార్థులకు అల్పాహారాన్ని పబ్లిక్ పరీక్షల వరకు అందిస్తున్నట్లు ట్రస్టు ప్రతినిధులు ముంగర రాంబాబు, పంచుమర్తి రవీంద్రబాబు తెలిపారు. సేవా ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పి.భానుచంద్రమూర్తి, సిహెచ్ మాధవి, వై.గాంధీ, వెలుగొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచాలి



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో

బల్లికురవ: ఉపాధి హామీ పథకంలో గ్రామాల వారీగా కూలీల సంఖ్య పెంచాలని ఫీల్డ్ అసిస్టెంట్, మేట్‌లను ఎంపీడీవో సీహెచ్ కృష్ణ ఆదేశించారు. బుధవారం పెదఅంబడిపూడి గ్రామంలోని చెరువులో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఎండల ఉధృతి రోజురోజూ పెరుగుతుందున ఉదయం 6 గంటలకే పనుల్లోకి రావాలని పని ప్రదేశంలో తగిన వసతులు ఏర్పాటు చేసుకోవాలని మేట్లను కోరారు.

పాఠశాలకు ప్రింటర్ బహూకరణ

వేటపాలెం: స్థానిక బీసీ బాలుర గురుకుల పాఠశాలకు పాఠశాల్లో చదువుతున్న విద్యార్థి శీలం సంతోష్ తండ్రి బాలకోటయ్య ప్రింటర్‌ను బహూకరించినట్లు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బూదాటి రజినీకుమారి బుధవారం తెలిపారు. విద్యార్థి తండ్రికి పాఠశాల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

ఆటో-బైక్ ఢీ, ఇద్దరికి గాయాలు

కారంచేడు: ఆటో-బైక్ ఢీకొనడంతో ఇద్దరికి గాయాలు అయ్యాయి. ఈఘటన వాడరేవు-పిడుగురాళ్ల ప్రధాన రహదారిలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. స్వర్ణ గ్రామానికి చెందిన వెంకటేష్, సాయిలు బైక్‌పై కారంచేడు నుంచి పర్చూరు వైపు వెళ్తున్నారు. ఇదే సమయంలో ఆటో పర్చూరు నుంచి కారంచేడు వైపు వస్తోంది. వాడరేవు-పిడుగురాళ్ల ప్రధాన రహదారిలో కారంచేడు-చీరాల మధ్యన వెంకటేశ్వరస్వామి గుడి సమీపంలోకి రాగానే ఆటో, బైక్ ఢీకొట్టుకున్నాయి. దీంతో బైక్ మీద ఉన్న ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను 108 వాహనంలో చీరాల ఆసుపత్రికి తరలించారు.

